క్లుప్తంగా

అదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ముందుగా న్యాయమూర్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పునకు అపీల్ లేదన్నారు. అ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల రాజీపడని కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. పలు కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి కృష్ణప్రియ పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మమ్మ దేవత కుంభాభిషేకంలో భాగంగా శనివారం విగ్రహ పంచామృత అభిషేకాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మమ్మ దేవత విగ్రహాన్ని గ్రామంలో పురవీధుల్లో ఊరేగించి, గ్రామ ఉత్సవం నిర్వహించారు. దేవాలయంలో కలశం ఆరాధన చేసి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, కుంభ స్థాపన, అన్నదానం జరుగుతుందన్నారు.


హామీల అమలులో చంద్రబాబు విఫలం

వరదయ్యపాళెం: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, అందుకు నిదర్శనం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే అని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా అన్నారు. 40ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉందని, సీఎంగా, ప్రతిపక్ష నేతగా సుదీర్ఘ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలపై వివక్ష చూపడం ఎంత వరకు న్యాయమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అందరినీ సమాన ధోరణితో చూడాలని.. కేవలం కొన్ని పార్టీలకు మాత్రమే పథకాలు ఇవ్వాలని మాట్లాడడం దారుణమన్నారు. మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో అశాంతి వాతావరణాన్ని అమలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కల్యాణోత్సవంలో గందరగోళం అవాస్తవం

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 2వ తేదీన జరిగిన 'కల్యాణోత్సవంలో గందరగోళం' అనే శీర్షికతో ప్రచురితమైన సాక్షి కథనం అవాస్తవమని టీటీడీ ప్రజాసంబంధాల శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. సిబ్బంది, పరివారం వేదికపై ఉండడంతో వెంకన్న కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించే అవకాశం లేకుండా పోయిందనడం అవాస్తవమని, ఆలయ సిబ్బంది భక్తులకు చక్కగా ఏర్పాట్లు చేశారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్న సిబ్బంది కల్యాణోత్సవ టికెట్లు, పంపిణీ చేసే సేవలో నిమగ్నమయ్యారని, ఎవరూ వేదికపై అడ్డుగా నిల్చుని భక్తులకు కనిపించకుండా చేయలేదని తెలిపింది.

ఉన్నతి.. ప్రగతికి పెన్నిధి



పేదరిక నిర్మూలన.. ఎస్టీ, ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉన్నతి పథకాన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వడ్డీ లేని రుణాలు పొందుతున్నారు. చిరువ్యాపారాలు చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఫలితంగా ఉన్నతి పథకం పేదల ప్రగతికి పెన్నిధిగా నిలుస్తోంది.

ఉన్నతి రుణ వివరాలివీ..

మండలం..	సభ్యుల సంఖ్య	రుణం(రూ.లక్షల్లో)
సత్యవేడు	32	18.67
నారాయణవనం	28	22.50
నాగలాపురం	102	72.5
బుచ్చినాయుడుకండ్రిగ	65	1.80

- వడ్డీ లేని రుణాలతో స్వయం ఉపాధి
- ఆర్థిక స్వావలంబన దిశగా ఎస్సీ, ఎస్టీ అతివల అడుగులు
- కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న మహిళలు

సత్యవేడు: కేంద్ర ప్రభుత్వ పథకాల్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉత్తర్ పూర్వ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇండస్ట్రియలైజేషన్ స్కీమ్ (ఉన్నతి) పథకం అమలు చేసింది. ఈ పథకం ఎస్సీ, ఎస్టీ మహిళలకు వరం లాంటిది. డీఆర్డీఏ, వెలుగు, ఎస్సీ కార్పొరేషన్ కలిసి ఉన్నతి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నాయి. దీని ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తున్నాయి. అయితే కేంద్రం పీఎంఎం అజయ్ పథకాన్ని అమలు చేస్తోంది. ఉన్నన్నతి పథకాన్ని కూడా ఆ అజయ్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. అందువల్ల తీసుకున్న రుణంలో 40 శాతం రాయితీ ఉంటుంది. అంటే రూ.1.20 లక్షలు తిరిగి చెల్లించాల్సిన పని ఉండదు. మిగిలిన రుణాన్ని సులభ వాయిదాల్లో చెల్లించవచ్చు. రుణం పొందిన 90 రోజుల తర్వాత తొలి వాయిదా చెల్లించవచ్చు. ఈ రుణాలకు వడ్డీ ఉండదు.

ఈ వ్యాపారాలు చేసుకోవచ్చు..

వ్యవసాయ రంగంలో.. నర్సరీలో మొక్కలు, పుట్టగొడుగులు, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, పచ్చిమిర్చి, చింతపండు, వేప పిండి విక్రయాలు, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

సేవారంగంలో: ఆటో రిక్షా, ఫొటో స్టూడియో, ట్రావెల్ ఏజెన్సీ, కంప్యూటర్ నెట్ సెంటర్, జిరాక్సు సెంటర్, బ్యూటీ పార్లర్, బ్యాండ్ ఆర్కెస్ట్రా , టైలరింగ్.

సూక్ష్మ వ్యాపారం: కిరాణా, చెప్పుల దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్స్, పూల వ్యాపారం, చీరలు, గాజులు, అల్పాహార కేంద్రాలు, బియ్యం, పప్పుదినుసులు, చిరుధాన్యాలు విక్రయాలు, మొబైల్ క్యాంటిన్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

చిన్నతరహా పరిశ్రమల విభాగంలో: కంప్యూటరు ఎంబ్రాయిడరీ, పేపర్ ప్లేట్ల తయారీ, కొబ్బరి పీచు, వాటర్ ప్లాంట్, కారం పిండి మరలు, పచ్చళ్లు, అప్పడాలు, చిక్కీలు, బిస్కెట్లు తయారీ, వడ్రంగి, గార్మెంట్ పరిశ్రమ తదితరాలు స్థాపించుకోవచ్చు.

మరికొన్ని పథకాలివీ..

మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం(పీఎంఈజీపీ), ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి, పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంతో(పీఎం ఎఫ్ఎంఈ) తదితర పథకాలు అమలు చేస్తోంది. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

అర్హులు వీరే..

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాళ్లుగా ఉన్న మహిళలకు గ్రూపు సభ్యుల తీర్మానంతో ఉన్నతి రుణాలు మంజూరు చేస్తున్నారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, యాసిడ్ దాడికి గురైన మహిళలు, సొంత ఇళ్లు, భూమి లేని నిరుపేద కుటుంబ మహిళలు ఈ రుణాలకు అర్హులు.

ఆర్థికాభివృద్ధి సాధన దిశగా..

కేంద్రప్రభుత్వ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకున్న పలువురు మహిళలు పలు వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. ఇలా సత్యవేడు నియోజకవర్గ పరిధిలో 227 మంది మహిళలు వివిధ రకాలు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..



సత్యవేడు దళితవాడలో సరస్వతి గ్రూపు సభ్యురాలిగా ఉన్నాను. పదో తరగతి వరకు చదివాను. భర్త చనిపోవడంతో గృహిణిగా ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక కుట్టు మిషన్ శిక్షణ పొంది ఇంట్లోనే దుస్తులు కుట్టి ఇస్తున్నాను. కూలీ గిట్టుబాటు అవుతుండడంతో నెలకు రూ.15 వేలు వరకు సంపాదిస్తున్నాను. పనిలో నైపుణ్యం పెరగడంతో ఎక్కువ మంది దుస్తులు కుట్టమని కోరుతున్నారు. దీంతో జీవన పరిస్థితి మెరుగుపడింది. ముగ్గురు పిల్లల్లో ఒకరికి వివాహం చేశాను. ఇద్దర్ని చదివిస్తున్నాను.

–ఏ.ఉషా, దళితవాడ సత్యవేడు

పిల్లల చదువుకు బాసటగా..



2001 నుంచి సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. బ్యాంకు నుంచి రూ.లక్ష రుణం తీసుకుని చీరల వ్యాపారం పెట్టాను. భర్త కూలీ పనులు చేస్తున్నారు. ముగ్గురు పిల్లల్ని చదివించడం కష్టంగా ఉండేది. సంఘం ద్వారా రుణం అందడంతో వ్యాపారం చేస్తూ కొంత లాభం రావడంతో కుటుంబంతో భర్తకు సాయంగా, పిల్లల చదువుకు వ్యాపారం ఆసరాగా ఉంటోంది. నెల నెలా రూ.3 వేలు బ్యాంకు రుణం చెల్లిస్తున్నాను. నాడు కూలీగా.. నేడు వ్యాపారిగా జీవనం సాగిస్తున్నాను.

–డి.కాంచన, దళితవాడ సత్యవేడు

కుటుంబానికి ఆసరాగా..



సంఘంలో సభ్యురాలుగా ఉండడంతో ఉన్నతి పథకంలో రూ. 50వేలు రుణం ఇచ్చారు. బ్యాంకు రుణంతో వ్యాపారాభివృద్ధిపై దృష్టి సారించాను. కిరాణా దుకాణం వ్యాపారం ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతున్నాను . రోజు వ్యాపారం చేస్తూ లాభం పొందుతున్నాను. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.20 వేలు మిగులుతోంది. ప్రతి నెలా బ్యాంకు రుణం రూ.2500 చెల్లిస్తున్నాను. పిల్లలందరికీ వివాహం చేశాను. నేనూ నా భర్త వ్యాపారం చేసుకుంటూ ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నాం.

–వి.పుష్ప, దళితవాడ, సత్యవేడు

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న కృష్ణ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ పరీక్ష సామగ్రిని అందజేశారు. టెన్త్ విద్యార్థులు ఈనెల 17వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు రాయనున్న నేపథ్యంలో విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, ఇతర పరీక్ష సామగ్రిని ఆయన అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుమార్‌నాయుడు, రాజేంద్ర, ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిన ఇల్లు

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట వివేకానంద కాలనీలోని ఓ ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బలక్ష్మి, ఆమె కుమారుడు కమలేష్ వివేకానంద కాలనీలో ఏడాది కిందట ఇల్లు నిర్మించుకుని కాపురం ఉంటున్నారు. సుబ్బలక్ష్మి భర్త రైల్వేలో కోపైలట్‌గా పనిచేస్తూ కరోనా సమయంలో మృతి చెందటంతో కారుణ్య నియామకం కిందట కుమారుడు కమలేష్‌కు ఉద్యోగం ఇస్తూ రైల్వేశాఖ జాయినింగ్ లెటర్ అందజేసింది. దీంతో వారు శనివారం వేకువజామున తిరుత్తణి సుబ్రమణ్యేశ్వరస్వామివారికి మొక్కులు చెల్లించుకునేందుకు పూజగదిలో దీపం వెలిగించి బయలుదేరారు. అయితే కాసేపటికే ఇంట్లో నుంచి పొగ, మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేలోపు పూజగది కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి






సత్యవేడు: మాట్లాడుతున్న ఏఎస్ఐ అన్నపూర్ణ, బుచ్చినాయుడు కండ్రిగ: మాట్లాడుతున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు, శ్రీకాళహస్తి: మహిళలకు సన్మానం, రేణిగుంట: సిబ్బందిని సత్కరిస్తున్న రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి

సత్యవేడు: పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తే సమాజంలో వివక్ష లేకుండా ఉంటుందని ఏఎస్ఐ అన్నపూర్ణ అన్నారు. స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో శనివారం తిరుపతి విజయవాణి, చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, ప్రోగ్రాం నిర్వాహకురాలు అమరావతి, ఏఎన్ఎం ఇంద్రాణి, సరస్వతి, నిర్మల, ట్రస్టు నిర్వాహకులు బి.అమరావతి, పీవీ వరలక్ష్మి, టీ సుప్రియ, ఏ.కృష్ణవేణి, బి.సంతోషి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక సంఘ పాఠశాలలో వేడుకలు జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, పూర్వ కమిటీ కన్వీనర్ సుధాకర్, ఉపాధ్యాయ కన్వీనర్ చెంచురాజు, పిళ్లారి ఫౌండేషన్ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీచైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. శ్రీనివాసకుమార్, జీపీఎస్ ఆచారి, లింగమూర్తి, కుప్పయ్య, గోవర్ధన్, సునీల్, ఎంఎస్ మ ణ్యం, శాంతమ్మ, గురవమ్మ, రాజ్యలక్ష్మి, ఉష, భవాని, నిర్మ లమ్మ, నిర్మల సావిత్రమ్మ పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, చీరలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీపతి, సీడీపీఓ శాంతిదుర్గ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కరకంబాడి హైస్కూల్‌లో రాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై స్వయం సహాయక సంఘ మహిళలను ఘనంగా సత్కరించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం , జిల్లా కోఆపరేటివ్ అధికారి లక్ష్మి, రాస్ జాయింట్ సెక్రటరీ మమత, రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, రాజశేఖర్‌నాయుడు, రమేష్‌రెడ్డి, పేరం నాగరాజునాయుడు, మునస్వామినాయుడు పాల్గొన్నారు. అలాగే రేణిగుంటలో ఓదార్పు మహిళా సంఘం అధ్యక్షురాలు హేమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రగతి డైరెక్టర్ కేవీ రమణ, చెరుకూరి సుగుణ పాల్గొన్నారు. రైల్వే పెన్షనర్స్ కార్యాలయంలో చైర్మన్ హసన్ సాహెబ్, సెక్రటరీ జయంత్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఐద్వా ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో జరిగిన వేడుకల్లో ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరి, న్యాయవాది అరుణ, సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, వెంకటరమణ పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఆర్పీఎఫ్ స్టేషన్‌లో శనివారం స్టేషన్ పరిధిలో పని చేస్తున్న మహిళా పోలీసు సిబ్బందిని సత్కరించారు. రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కె.రాజగోపాల్‌రెడ్డి పాల్గొని, శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఐపీఎఫ్ సందీప్‌కుమార్, ఏఎస్ఐలు నాగేశ్వరరావు, రమేష్‌బాబు, జగదీష్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెంచులక్ష్మి మ్యాక్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, చెంచులక్ష్మి మ్యాక్స్ అధ్యక్షురాలు అనితాలక్ష్మి పాల్గొన్నారు.

సిద్ధార్థలో..

నారాయణవనం: సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ రేష్మారెడ్డి పాల్గొని, ప్రసంగించారు. అనంతరం మహిళా ఉద్యోగులను కళాశాలల చైర్మన్ అశోకరాజు సన్మానించారు. ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, మహిళా విభాగం కో–ఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు



ఉపాధ్యాయినులకు ఏపీటీఎఫ్ నేతల సన్మానం



గైనకాలజిస్ట్ రేష్మారెడ్డిని సన్మానిస్తున్న అశోకరాజు

ఉత్తమ మహిళగా మమత



మెమెంటో అందుకుంటున్న మమత

నారాయణవనం: ఉత్తమ మహిళగా ఏపీఎం మమత కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న ఈ జ్ఞాపిక మరింత బాధ్యతను పెంచిందని ఏపీఎం మమత తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళా సభ్యుల ఆర్థిక సాధికారతను సాధించడానికి చేపట్టిన కార్యక్రమాలతో నారాయణవనం మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపినందుకు డీఆర్‌డీఏ తిరుపతి శాఖలో ఉత్తమ మహిళా అవార్డును అందుకున్నట్లు మమత పేర్కొన్నారు.

బొజ్జల వర్గీయుల బూతు పురాణం

- సోషల్ మీడియా వేదికగా ఎస్సీవీకి హెచ్చరికలు
- మరోచోట ఎస్సీవీ వర్గం విలేకరుల సమావేశం




మాట్లాడుతున్న ఎస్సీవీనాయుడు వర్గం, విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వర్గం

శ్రీకాళహస్తి: శుక్రవారం ఎస్సీవీ నాయుడు ఏర్పాటు విలేకరుల సమావేశంపై సోషల్ మీడియా వేదికగా బొజ్జల సుధీర్‌రెడ్డి వర్గం రెచ్చిపోయింది. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆయనపై బూతు పురాణం అందుకుంది. హేమంత్ అనే యువకుడు సోషల్ మీ డియా వేదికగా తాను బొజ్జల సుధీర్‌రెడ్డి ఫాలోవర్ అని ఎస్సీవీ నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇంటిని వెయిమందితో ముట్టడిస్తామని హెచ్చరించడం విమర్శలకు దారి తీసింది. అనంతరం మాజీ పాలకమండలి సభ్యులు కాసరం రమేష్ మాట్లాడుతూ ఎస్సీవీనాయుడు చరిత్ర అంతా కబ్జా మ యం అని, కాలువ పోరంబోకులో ఇల్లు కట్టుకున్నాడని, ఎన్ని పార్టీలుంటే అన్ని పార్టీలు తిరిగాడన్నా రు. సుధీర్‌రెడ్డిని విమర్శించే స్థాయి అతనిది కాదని అంటూ సోషల్ మీడియా వేదికగా ఎస్సీవీ నాయుడుపై విరుచుకుపడ్డాడు. అదే స్థాయిలో టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు మాట్లాడుతూ ఎస్సీవీ నాయుడుది వెన్నుపోటు రాజకీయాలకు పెట్టింది పేరని, టీడీపీలోని వారిపై చాడీలు చెప్పడం అతనికి అలవాటని చంద్రబాబునాయుడు వద్ద ఎస్సీవీనాయుడుకు అంత సీన్ లేదని తెలిపారు. అనంతరం తాటిపర్తి ఈశ్వరరెడ్డి మా ట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి ఏదైనా పొరబాటు మాట్లాడి ఉంటే ఇద్దరు కూర్చుని మాట్లాడుకోవాలే కానీ, ఇలా ప్రెస్‌మీట్‌లు పెట్టడం సరికాదన్నారు. చలపతినాయుడు మాట్లాడుతూ నీవన్ని సక్రమంగా ఉంటే ఎందుకు ఉలిక్కిపడుతున్నామని ఎస్సీవీనాయుడుని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడటం సరికాదన్నారు.

ఎస్సీవీ వర్గం

స్థాయిలేని వారు ఎస్సీవీనాయుడిని విమర్శిస్తే ఊరుకోబోమని, ఆ భూముల విషయం మొత్తం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వివరాలు అందజేశామని, అయినా ఆయన అసెంబ్లీలో ప్రస్తావించడం బాధాకరమన్నారు. హేమంత్, కాసరం రమేష్ వారి స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. అనంతరం ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ నిన్న కాక మొన్న పార్టీలోకి వచ్చిన వారంతా ఎస్సీవీని విమర్శించేస్థాయి కాదన్నారు. ఎస్సీవీనాయుడికి చెందిన చంద్రగిరి నియోజకవర్గంలో భూముల గురించి ఇ లా మాట్లాడడం సరికాదన్నారు. అంజూరు సుధా కర్ మాట్లాడుతూ ఎస్సీవీనాయుడిపై ఇలా అభాండాలు వేయడం సరైన పద్ధతి కాదన్నారు. శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీవీ నాయుడు సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అని, ఆయన స్థాయి దిగజార్చేలా టీడీపీలోని కొందరు సోషల్ మీడియా వేదికగా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, స్థా యిని చూసి మురిసిపడవద్దని హితవు పలికారు. ఇర్ల కిషోర్ మాట్లాడుతూ హేమంత్‌రాయల్! మీ నాన్నకు ఉద్యోగం ఇప్పించింది ఎస్సీవీనాయుడే.. తెలియకపోతే మీ నాన్నను అడగాలన్నారు. బొజ్జల సుధీర్ వద్ద చేరి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. కాసరం రమేష్ ఎస్సీవీనాయుడు ఏదో పార్టీలు మారాడని చెబుతున్నాడని, ఇతను ముందు ఏ పార్టీలో ఉన్నాడో ఎన్నికల ముందు బీజేపీ నుంచి టీడీపీకి వచ్చిన మాట వాస్తవం కాదా? అని ఇష్టం వచ్చినట్లు ఎస్సీవీనాయుడి గురించి మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు.

230 కేసులు పరిష్కారం




లోక్అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి

సత్యవేడు: మండల కేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 230 కేసులు పరిష్కారమైనట్లు తిరుపతి ఎర్రచందనం కోర్టు జడ్జి శ్రీకాంత్ తెలిపారు. సివిల్, క్రిమినల్, డ్రంక్ అండ్ డ్రైవ్, బ్యాంకు కేసులు, ఎస్ఐఎఫ్ తదితర కేసులు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, స్థానికుల సహకారంతో కేసుల పరిష్కారానికి సాధ్యమైందని అన్నారు.

నాసా స్పేస్ కాంటెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా నాసా–ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన లివింగ్ ఇన్ హెల్దీ స్పేస్ కాంటెస్ట్ 2024- 25లో శ్రీకాళహస్తి చిన్నారులు ప్రతిభ కనబరిచారు. శ్రీకాళహస్తి పట్టణం జయరామ్‌రావువీధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులు రీజనరేటివ్ అగ్రికల్చర్ బియాండ్ ఎర్త్ అనే అంశంపై చేసిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని సొంతం చేసుకుందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రూపొందించిన ఎం.అశ్విన్ కుమార్, డి.యువతేజ, వి.మునిలిఖిత్, పి.దేవిశ్రీ పాదసాయి, వి. నిహాల్‌రామ్, ఎస్. కీర్తిజ్ఞాన, రోహన్‌కు ప్రశంసాపత్రాలు, జ్ఞానపికలు అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, అకాడమిక్ డీన్ శంకర్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ గిరిజ, నాసా ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం, ఏఓ శివ కృష్ణమరాజు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు